సాక్షి
పశ్చిమగోదావరి


సోమవారం । 19 । జూన్ । 2023



రొయ్యలకు గిరాకీ

ఆక్వా రైతులు చిన్న కౌంట్ రొయ్యల పట్టుబడికి మక్కువ చూపుతున్నారు. 100 కౌంట్ రొయ్యలకు ధర బాగుంది.

IIలో



తలుపులమ్మ సంబరాలు

తలుపులమ్మ లోవలో అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

IIలో



జగన్నాథ రథోత్సవాలకు ఏర్పాట్లు

లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జగన్నాథ రథోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

IIలో

అన్నదాతకు ఆధరవు

మెండైన మద్దతు

- పంటలకు పెరిగిన మద్దతు ధరలు
- ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ప్రకటించిన ప్రభుత్వం
- ధరలకు అనుగుణంగా సాగుకు రైతుల సన్నద్ధం



తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో నారుమడిని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

మద్దతు ధరలు ఇలా.. (క్వింటాలుకు)

పంట	గతేడాది (రూ.లలో)	ప్రస్తుత ఏడాది (రూ.లలో)	పెరుగుదల (రూ.లలో)
వరి గ్రేడ్-ఏ	2,060	2,203	143
వరి కామన్	2,040	2,183	143
మొక్కజొన్న	1,962	2,090	128
కందులు	6,600	7,000	400
పెసర	7,755	8,558	803
మినుములు	6,600	6,950	350
వేరుశెనగ	5,850	6,377	527
పత్తి (పొడుగు రకం)	6,380	7,020	640
పత్తి (మధ్య రకం)	6,080	6,620	540

ఏలూరు(మెట్రో): అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోంది. విత్తు నుంచి పంట విక్రయాల వరకూ అన్నింటా అండగా నిలుస్తోంది. పంటలకు మద్దతు ధర అందించడంతో పాటు దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా పంటలను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తోంది. అలాగే ఏటా రైతులకు మద్దతు ధరలు ప్రకటిస్తూ ఈ మేరకు కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఖరీఫ్ సీజన్ మొదట్లోనే పంటలకు మద్దతు ధరలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వరి రైతులకు ఊరట

రాష్ట్రంలోని ప్రధాన పంటలన్నింటికీ ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించింది. ప్రధానంగా వరి రైతుకు ఊరట ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వరి ప్రధాన పంట కావడంతో మద్దతు ధరల పెంపు ఇక్కడి రైతులకు ఉపశమనం కలిగిస్తోంది. క్వింటాలుకు ధరలు వరి ఏ-గ్రేడ్‌కు రూ.2,203కు, కామన్ రకానికి రూ.2,183కు పెంచారు. గతేడాదితో పోలిస్తే రైతులకు అదనంగా రూ.143 అందనుంది. అలాగే అపరాల పంటలకు మార్కెట్‌లో ధరలకు అనుగుణంగా క్వింటాలుకు పెసరకు అత్యధికంగా రూ.803 పెరగడం విశేషం. పంటల రకాన్ని బట్టి గతేడాది రూ.92 నుంచి రూ.523 వరకు పెరగగా, ప్రస్తుతం రూ.143 నుంచి రూ.803 వరకు పెంచారు. పత్తి ధరలు రూ.640, వేరుశనగ రూ.527, కందులు రూ.400, మొక్కజొన్న రూ.128 చొప్పున పెంచారు.

అన్నివిధాలా ఆదుకునేలా..

ప్రతి రైతూ మద్దతు ధరకు పంటలను విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో దళారుల వద్ద పంటలు విక్రయించి రైతులు మోసపోయేవారు. తూకాలు, రవాణా, ధర విషయంలో దళారుల దోపిడీ బారిన పడేవారు. వీటన్నింటికీ చెక్ పెట్టేలా ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి పంటలను కొనుగోలు చేస్తూ మద్దతు ధరలు అందిస్తోంది. పండించిన పంటలు మార్కెట్‌లోకి రాకముందే ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల వారీగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంది. ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటుచేసి రైతులకు అవగాహన కూడా కల్పిస్తోంది. అలాగే మద్దతు ధరలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ఖర్చులకు అనుగుణంగా..



పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా రైతులకు ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటిస్తోంది. ఎటువంటి ఇబ్బంది లేకుండా పంటలను రైతులు నేరుగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రాల్లోనే విక్రయించునే అవకాశాన్ని కల్పిస్తోంది. దళారుల వద్ద రైతులు మోసపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

– వై.రామకృష్ణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, ఏలూరు

న్యూస్‌రీల్

ఎంఈఓ-1 పోస్టులపై వినతి



డీఈఓ రవిసాగర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో ప్రస్తుతం పని చేస్తున్న ఎంఈఓ-1లను యథావిధిగా కొనసాగించాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. గతనెల 5న ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశంలో విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ అధికారులు ఎంఈఓ-2 పోస్టులన్నీ జిల్లాపరిషత్ యాజమాన్యానికి, ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టులను మాత్రమే ప్రభుత్వం వారికి ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఈఓలు అందరినీ యథాతథ స్థితితో కొనసాగించాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాప్టో నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, సీహెచ్ మంజుల, జి.కృష్ణ, ఎస్.రంగవలి, ఎల్.సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాసిడ్ దాడి బాధితురాలికి అండగా ప్రభుత్వం

వైద్య ఖర్చులన్నీ భరిస్తాం: కలెక్టర్

ఏలూరు(మెట్రో): ఏలూరులో ఇటీవల యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలి వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని అత్యవసర పరిస్థితుల్లో విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించగా వైద్య చికిత్సకు సుమారు రూ.16.40 లక్షలు ఖర్చవుతాయన్నారని పేర్కొన్నారు. బాధితురాలి కుటుంబం ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడం, బాధితురాలి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి బాధితురాలికి ఎంత ఖర్చయినా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, వెంటనే చికిత్స చేయించాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యానికి ఈనెల 15న సీఎం సహాయనిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ అందిందని తెలిపారు. దీంతో ఆస్పత్రి వర్గాలు బాధితురాలికి చికిత్స అందిస్తున్నారన్నారు. అదనపు ఖర్చుల నిమిత్తం తక్షణ ఆర్థిక సాయం కింద మొదటి విడతగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా బాధితురాలికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తీసుకున్న చొరవతో బాధితురాలికి ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని, ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు.

కోకో తోటలో మంటలు



రామశింగవరంలో దగ్ధమైన కోకో తోట

పెదవేగి: మండలంలోని రామశింగవరంలో రెండున్నర ఎకరాల కొబ్బరి, కోకో తోట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన కొప్పుల వెంకటరామయ్యకు చెందిన కోకో తోట ఆదివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. తోట మధ్య నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలపై కొబ్బరి మట్ట పడటంతో మంటలు వ్యాపించినట్టు బాధిత రైతు చెబుతున్నారు. మంటలు ఎగసిపడటంతో అదుపు చేయడం కష్టమైందని సర్పంచ్ అడపా శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం మాధవ తెలిపారు. గ్రామస్తులంతా కలిసి మంటలు చుట్టుపక్కల తోటలకు వ్యాపించకుండా నివారించగలిగామని చెప్పారు. అగ్నిప్రమాదంతో రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు వెంకట్రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

సారా స్థావరాలపై దాడి

కుక్కునూరు: సారా స్థావరాలపై ఆదివారం ఎక్సైజ్ పోలీసులు మెరుపు దాడి చేశారు. అల్లిగూడెం గ్రామంలో కొందరు వ్యక్తులు సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో జిల్లా ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. సారా తయారుచేసేందుకు సిద్ధం చేసిన 1,200 లీటర్ల బెల్లపు ఊట, 20 లీటర్ల సారా, 20 కిలోల అమ్మోనియాను స్వాధీనం చేసుకుని బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న అల్లిగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఈబీ డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్‌కే ధనరాజ్, ఎస్సై సీహెచ్ అల్లూరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

24 వరకు ఒంటిపూట బడులు



కాళ్లలో హైస్కూల్

సాక్షి,భీమవరం: తీవ్ర ఎండల నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలలకు ఈనెల 24వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఈనెల 12న వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం కాగా అధిక ఉష్ణోగ్రతలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఈనెల 17 వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని, 19 నుంచి రెండు పూటలా బడులు నిర్వహించాలని ముందుగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే ఎండల తీవ్రత తగ్గకపోవడంతో ప్రభుత్వం ఒంటిపూట బడులను ఈనెల 24 వరకు మరో వారం పొడిగించిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం 8.30 గంటలకు రాగి జావ, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న భోజనం అందిస్తామని డీఈఓ వెంకటరమణ తెలిపారు.

గురుకుల విద్యార్థులకు పురస్కారాలు

పెదవేగి: పెదవేగి బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయానికి చెందిన ఇంటర్ విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పురస్కారాలు అందుకున్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను శనివారం ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సత్కరించినట్టు ఆదివారం ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు తెలిపారు. పెదవేగి గురుకులంలో సీనియర్ ఇంటర్ విద్యార్థి వి.గిడియోస్ హడ్సన్ టైలర్ (ఎంపీసీ)కి రూ.50 వేల చెక్కు, ప్రశంసాపత్రం, పతకం అందించి సత్కరించారన్నారు. 10వ తరగతి పరీక్షల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థి డి.వెంకటమణికంఠకు రూ.30 వేల చెక్కు, ప్రశంసాపత్రం, పతకం అందించి సత్కరించారన్నారు. పూర్వ ప్రిన్సిపల్ ఎస్.భారతి, ప్రస్తుత ప్రిన్సిపల్ వై.శ్రీనివాసరావు, కళాశాల పీడీ జయరాజు, సిబ్బంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు

ఏలూరు రూరల్: ఏలూరులో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో జరిగిన సెలెక్షన్స్‌కు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 70 మంది బాలబాలికలు తరలివచ్చారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశామని అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి నూజివీడు ధర్మ అప్పారావు కళాశాలలో జరిగే ఆంధ్రప్రదేశ్ 7వ అంతరజిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ప్రధాన జట్లతో పాటు ఐదుగురు చొప్పున స్టాండ్‌బై క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు సాంబ, రమేష్‌తో పాటు పలువురు పోటీలను పర్యవేక్షించారు.

పట్టణ పీహెచ్‌సీలు రెడీ

- 5 పట్టణాల్లో 8 భవనాల నిర్మాణం
- రూ.7.28 కోట్ల ఖర్చు
- పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యం
- నరసాపురం, తాడేపల్లిగూడెంలో అందుబాటులోకి సేవలు



తాడేపల్లిగూడెంలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ పేదలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ అర్బన్ పీహెచ్‌సీల ఏర్పాటుకు సంకల్పించారు. దీనిలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేయడంతో పాటు పక్కా భవనాలు మంజూరు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు పట్టణాల్లో ఎనిమిది అర్బన్ పీహెచ్‌సీలకు భవనాలు మంజూరయ్యాయి.

త్వరితగతిన నిర్మాణాలు

జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లులో నూతనంగా ఎనిమిది అర్బన్ పీహెచ్‌సీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.7.28 కోట్ల నిధులు మంజూరు చేసింది. నరసాపురం, తాడేపల్లిగూడెంలో నిర్మాణాలు పూర్తిచేసుకుని భవనాలు అందుబాటులోకి రాగా మిగిలిన ప్రాంతాల్లో తుది దశకు చేరుకున్నాయి. వీటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభోత్సవానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఒక్కో భవనాన్ని రూ.80 లక్షల నుంచి రూ.1.20 కోట్లతో నిర్మాణం చేపట్టారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

సీఎం జగన్ పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పలు చర్యలు తీసుకున్నారు. వేల కోట్ల రూపాయలను ప్రజారోగ్యానికి వెచ్చిస్తున్నారు. దీనిలో భాగంగా పల్లె ప్రజల కోసం విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ప్రజల కోసం అర్బన్ పీహెచ్‌సీలను ఏర్పాటుచేస్తున్నారు. స్థానికంగానే పలురకాల వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. పీహెచ్‌సీల్లో డాక్టర్లు, వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి సాధారణ వైద్య సేవలు దగ్గర నుంచి ప్రసవాలు, శస్త్రచికిత్సలు వరకూ చేయించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ప్రజలు ప్రయాణ ఖర్చుతో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ నుంచి బయటపడుతున్నారు.

అర్బన్ పీహెచ్‌సీలు ఇలా

పట్టణం	నూతన భవనాలు	నిర్మాణ ఖర్చు (రూ.కోట్లలో)
తాడేపల్లిగూడెం	2	1.60
భీమవరం	3	2.40
నరసాపురం	1	1.04
పాలకొల్లు	1	1.20
తణుకు	1	1.04

త్వరితగతిన వినియోగంలోకి..



జిల్లాలో ఐదు పట్టణాల్లో ఎనిమిది అర్బన్ పీహెచ్‌సీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. రెండు చోట్ల భవనాలను వినియోగంలోకి తీసుకురాగా, మిగిలిన చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిని అతి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డి.మహేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, భీమవరం

నైపుణ్యంతో జీవన ప్రమాణాల మెరుగు

కలెక్టర్ పి.ప్రశాంతి



కుట్టుమెషీన్లు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పాలకొల్లు అర్బన్ : ప్రతిఒక్కరూ తాము చేపట్టిన వృత్తిలో నైపుణ్యం పెంచుకుని జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. మండలంలోని శివదేవునిచిక్కాలలో శ్రీ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ప్రశాంతి ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ట్రస్టు ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధికి బాటలు వేసుకోవాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రతి మహిళ లక్ష్యాన్ని నిర్దేశించుకుని శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, ఇతరులపై వ్యతిరేక భావాన్ని వీడాలని అన్నారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల అనంత వెంకట రామారావు మాట్లాడుతూ 340 మంది కుట్టు శిక్షణ పొందడానికి దరఖాస్తు చేసుకున్నారని, వీరంతా క్రమశిక్షణతో శిక్షణ పొందాలని కోరారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, సీఈఓ కోట్ల శివశంకర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడారు. అతిథులను నిమ్మల శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా దుంపగడపలో శిక్షణ పొందిన మహిళలకు కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా కుట్టుమెషీన్లు అందించారు. ట్రస్టు కోశాధికారి నిమ్మల భవానీ, నిమ్మల కృష్ణవేణి, కనుమూరి అన్నపూర్ణ, నిమ్మల సత్యనారాయణ, సర్పంచ్ దిడ్ల మణివజ్రం, మాజీ సర్పంచ్ వడ్డె సోమచంద్రశేఖర్, ట్రస్టు కరస్పాండెంట్ వడ్డె నారాయణరావు పాల్గొన్నారు.

కొత్తపల్లి.. చీప్ పాలి'ట్రిక్స్'

- పాత కేసుల్లో నోటీసులపై ఇరుకున పెట్టే ప్రయత్నం
- ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరిపై బురదజల్లే కుతంత్రం
- పోలీసుల వివరణతో అభాసుపాలైన వైనం



మీడియా సమక్షంలో పోలీసుల నుంచి నోటీసులు తీసుకుంటున్న మాజీ మంత్రి కొత్తపల్లి

నరసాపురం : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ బహిష్కృత నేత కొత్తపల్లి సుబ్బారాయుడు తన మార్కు సిల్లీ పాలిటిక్స్‌తో అభాసులపాలయ్యారు. పాత కేసుల్లో పోలీసు నోటీసులు వస్తే వాటిని పవన్ కళ్యాణ్ వారాహి యాత్రకు ముడిపెట్టడమే కాకుండా, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు హస్తం ఉందంటూ ప్రచారం చేశారు. అయితే ఇందులో ఇలాంటి కోణాలు ఏమీలేవని, కొత్తపల్లి వ్యూహాత్మకంగా పోలీసులను పిలిపించుకుని నోటీసులు తీసుకోవడం, అదే సమయంలో మీడియాను కూడా పిలిచి రివర్స్‌గేర్ వేశారని నరసాపురం డీఎస్పీ కె.మనోహరాచారి వెల్లడించడంతో ఆయన కుతంత్రం బయటపడింది. వివరాలిలా ఉన్నాయి.. గతేడాది నరసాపురం జిల్లా కేంద్రం చేయాలనే పోరాటం మాటున నిబంధనలకు విరుద్ధంగా కొత్తపల్లి, మరికొందరు చేసిన పనులపై పోలీసు కేసులు నమోదయ్యాయి. అలాగే గతేడాది పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా సీతారామపురంలో 216 జాతీయ రహదారిపై సెక్షన్ 30 అమల్లో ఉండగా కొత్తపల్లి ర్యాలీ చేశారు. ఇలా మూడు కేసులకు సంబంధించి 41 నోటీసులను మొగల్తూరు పోలీసు సిబ్బంది కొత్తపల్లికి అందించారు.

పక్కా వ్యూహంతోనే..

కొత్తపల్లి ఈ వ్యవహారాన్ని రాజకీయం చేయాలని పక్కా వ్యూహం రచించారు. పోలీసులు మూడు నెలలుగా కొత్తపల్లికి నోటీసులు అందించేందుకు ప్రయత్నిస్తున్నా ఆయన కాలయాపన చేస్తూ వచ్చారు. చివరికి శనివారం పోలీసు అధికారులకు కొత్తపల్లి ఫోన్ చేసి ఆదివారం నోటీసులు తీసుకుంటానని రమ్మని చెప్పారు. అదే సమయానికి మీడియాను కూడా పిలిచి ఆయన అనుకున్న రీతితో ఈ వ్యవహారాన్ని కొత్త మలుపు తిప్పే ప్రయత్నం చేశారు. తాను పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలకు వెళ్లడం నేరమా? తనపై ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కేసులు పెట్టింటి వారాహి యాత్రను అడ్డుకోవాలని చూస్తున్నారు, పోలీసులను అడ్డుపెట్టుకుని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం సాగుతోందని ఆరోపించారు. వారాహి యాత్రకు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరికి కేసులను ముడిపెట్టారు. అయితే డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి తేటతెల్లం చేయడంతో కొత్తపల్లి అభాసుపాలయ్యారు. మిగిలిన పార్టీల్లో దారులు మూసుకుపోయిన నేపథ్యంలో కొత్తపల్లి కొత్త ఎత్తుల్లో భాగంగానే అనవసర రాద్ధాంతం చేస్తున్నారనే విమర్శలు గుప్పుమన్నాయి.

వారాహి యాత్రకు సంబంధం లేదు



మాట్లాడుతున్న డీఎస్పీ రవిమనోహరాచారి

పవన్‌కళ్యాణ్ వారాహి యాత్రకు మాజీ మంత్రి కొత్తపల్లికి నోటీసులు ఇవ్వడానికి ఎలాంటి సంబంధం లేదని నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరాచారి స్పష్టం చేశారు. నరసాపురంలో ఆయన కార్యాలయంలో సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్తపల్లికి నోటీసులు ఇవ్వడంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవన్నారు. పెండింగ్ కేసులు క్లియర్ చేయాలన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పాత మూడు కేసుల్లో కొత్తపల్లికి నోటీసులు ఇచ్చామన్నారు. దీనిని వారాహి యాత్రతో కొత్తపల్లి లింక్ పెట్టడంలో వాస్తవం లేదన్నారు. పొరుగు జిల్లాలో వారాహి యాత్రకు ఎలాంటి నిబంధనలు ఉన్నాయో.. నరసాపురంలో కూడా అవే వర్తిస్తాయన్నారు. కొత్తపల్లి ఒక్కరికి మాత్రమే కాదని ఆయా కేసుల్లో మొత్తం 70 మందికి నోటీసులు ఇచ్చామని డీఎస్పీ చెప్పారు. నరసాపురం రూరల్ సీఐ వి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్టీ క్రైస్తవులపై మారణకాండ ఆపాలి



మణిపూర్ అల్లర్లపై నిరసన వ్యక్తం చేస్తున్న ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ నాయకులు

ఏలూరు (టూటౌన్): మణిపూర్‌లో ఎస్టీ క్రైస్తవులపై దమనకాండ ఆపాలని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేశారు. మణిపూర్ అల్లర్లకు వ్యతిరేకంగా ఆదివారం ఏలూరులో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెరికె మాట్లాడుతూ క్రైస్తవులు బీజేపీకి వ్యతిరేకం కాదని అయినప్పటికీ మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు నిరంతరం కొనసాగుతున్నాయన్నారు. తక్షణమే అల్లర్లను ఆపివేయాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నిరసన చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంపై ఆదివారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఆలయ పరిసరాలు నామమాత్రపు భక్తులతో దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వల్ప సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించారు. ఆ తరువాత ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు దాదాపు ఖాళీగా కనిపించాయి. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో క్షేత్ర రహదారులు నిర్మానుష్యంగా మారాయి.

మహిళ ఆత్మహత్య కేసులో అనుమానితుడి అరెస్ట్

ద్వారకాతిరుమల: ఒక మహిళ ఆత్మహత్య కేసులో అనుమానిత వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్టు టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన క్లాం మాధవి(36) ఈ నెల 15న ఉదయం పురుగుల మందు తాగి, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదేరోజు మధ్యాహ్నం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి బోడ జయమ్మ ఫిర్యాదు మేరకు ఈనెల 16న స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో జి.కొత్తపల్లికి చెందిన పొంగులేటి భూషణంను అరెస్టు చేసి, భీమడోలు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

చిన్న కౌంట్ రొయ్యలకు గిరాకీ

తక్కువ రోజుల్లోనే పట్టుబడికి రైతుల మొగ్గు


భీమవరం ప్రాంతంలో పట్టుబడి పట్టిన రొయ్యలను ట్రేలలో వేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఆక్వా రైతులు చిన్న కౌంట్ రొయ్యల పట్టుబడికి మక్కువ చూపుతున్నారు. గతంలో పెద్ద కౌంట్ రొయ్యలు పట్టుబడితే ఆ రైతును గొప్పగా చెప్పుకునేవారు. అయితే మేతల ధరలు పెరగడం చిన్నకౌంట్ ధర అనుకూలంగా ఉండడంతో తక్కువ రోజుల్లోనే రొయ్యలు పట్టుబడి పట్టి సొమ్ములు చేసుకోవాలనే లక్ష్యంతో రైతులు ఆక్వా సాగుచేస్తున్నారు. మన రొయ్యలను కొనుగోలు చేసే ఇతర దేశాల్లో చిన్న కౌంట్ రొయ్యలనే ఎక్కువగా కొనుగోలు చేసుకోవడంతో రైతులు పట్టుబడులు పడుతున్నారు. ప్రస్తుతం 100 కౌంట్ రొయ్యలు రూ.220 పైగా కొనుగోలుచేయడం రైతులకు కలిసివచ్చింది.

1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు

జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తుండగా ప్రభుత్వం 10 ఎకరాల లోపు చెరువులు కలిగిన రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వడంతో చిన్న, సన్నకారు రైతులు లబ్ధి పొందుతున్నారు. మేతల ధరలు పెరగడంతో చిన్న రైతులు పెట్టుబడి పెట్టడానికి ఇబ్బంది పడుతున్నారు. ఎకరం విస్తీర్ణంలో రొయ్యలను 100 కౌంట్ వరకు పెంచాలంటే దాదాపు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. దీనిలో మేత ఖర్చే అధికం. పెద్ద కౌంట్ రొయ్యల ధరలు తక్కువగా ఉండడంతోపాటు ఎగుమతులు వేగంగా లేకపోవడంతో రైతులు చిన్నకౌంట్ రొయ్యల అమ్మకాలకే మక్కువ చూపుతున్నారు.

వీడని వ్యాధులు భయం

రొయ్యల సాగులో నాణ్యమైన సీడ్‌దే ప్రధానపాత్ర. ఎక్కడికక్కడ విచ్చలవిడిగా హేచరీలు ఏర్పాటు చేయడం వల్ల వాటిలో నాణ్యత లేకపోవడంతో రొయ్యలకు ఎక్కువగా తెగుళ్లు సోకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. రొయ్యలకు ఎక్కువగా వైట్‌స్పాట్, విబ్రియో, వైట్‌కట్, ఇహెచ్‌పీ తెగుళ్లు సోకడంతో వ్యాధుల నివారణకు పెద్ద మొత్తంలో ఖర్చుచేయాల్సివస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రొయ్యల ధరలు ఇలా

రొయ్యల కౌంట్	ధర
100	రూ. 220
90	రూ.225
80	రూ.235
70	రూ.245
60	రూ.255
50	రూ.270
40	రూ.320
30	రూ.420

ప్రస్తుతం వేసవి సీజన్‌లో నీటి కొరత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎక్కువ మంది రైతులు చెరువుల్లో రొయ్య పిల్లలు వేయకుండా ఖాళీగా ఉంచారు. పెద్దగా పట్టుబడులు లేకున్నా 100 కౌంట్ మినహా మిలిగిన కౌంట్ రొయ్యలకు ఆశించనంత ధర పలకడం లేదని రైతులు చెబుతున్నారు.

ఎగుమతులకు ఇబ్బందులు లేవు



మన రొయ్యల ఎగుమతులకు ఇబ్బందులు లేవు. గతంలో ఇక్వాడర్ నుంచి అధిక ఎగుమతులు ఉండడంతో మన ఉత్పత్తులకు గిరాకీ తగ్గి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇతర దేశాలకు ఎగుమతులు పెరిగాయి. ప్రస్తుతం రైతులు ఖర్చులను దృష్టిలో పెట్టుకుని 100 కౌంట్ రొయ్యల విక్రయాలకే మక్కువ చూపుతున్నారు. రొయ్యల ధరలు తగ్గించకుండా ప్రభుత్వ పరంగా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం.

– ఎల్ఎల్ఎన్ రాజు, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

20 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ

కామవరపుకోట: స్థానిక కొత్తూరులో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వద్ద అక్రమంగా రవాణ చేస్తున్న 20 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి మండలం రాఘవాపురానికి చెందిన గుబ్బల శ్రీనివాసరావు చింతలపూడి పరిసర ప్రాంతాల నుంచి అతి తక్కువ ధరకు రేషన్ బియ్యం సేకరించి అక్రమంగా రవాణా చేసేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి లారీలో రేషన్‌బియ్యంతో చింతలపూడిలో బయలుదేరి కాకినాడ తరలిస్తుండగా.. కామవరపుకోట కొత్తూరు సబ్ స్టేషన్ సమీపంలో తనిఖీ చేశారు. అందులో 410 బస్తాల్లో ఉన్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని యజమాని గుబ్బల శ్రీనివాసరావు, లారీ డ్రైవర్ తాళ్లూరు నానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



జగన్నాథ రథోత్సవాలకు ఏర్పాట్లు


ఉత్సవాలకు సిద్ధమైన రథం


సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జగన్నాథ రథోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఈనెల 29 వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దశావతారాల్లో స్వామివారు దర్శనమివ్వనున్న మండపాన్ని సుందరీకరిస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరిస్తున్నారు. ఇప్పటికే స్వామివారి రథ చక్రాలకు మరమ్మతులు చేసి, ఆలయం ముందు సిద్ధంగా ఉంచారు. ఉత్సవాల తొలిరోజు 20న స్వామివారు రథ వాహనంపై లక్ష్మీపురం ఆలయం నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి, ఉత్సవాల ఆఖరి రోజు 29న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి రథయాత్రగా వెళతారు. ఆలయ మండపంలో స్వామివారు ఉత్సవాల తొలిరోజు 20న మత్స్యావతారం, 21న కూర్మావతారం, 22న వరాహావతారం, 23న నరసింహావతారం, 24న వామనావతారం, 25న పరశురామావతారం, 26న రామావతారం, 27న కృష్ణావతారం, 28న కల్కిఅవతారం, 29న శ్రీ వేంకటేశ్వర స్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

● గడపగడపకు సంక్షేమం


పెంటపాడు: మండలంలోని ఆకుతీగపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శశి విద్యార్థుల సత్తా


వేలివెన్ను శశి క్యాంపస్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ

ఉండ్రాజవరం: జేఈఈ అడ్వాన్స్‌డ్–2023 ఫలితాలలో శశి వేలివెన్ను విద్యార్థులు ఆలిండియా కేటగిరీలలో అత్యుత్తమ ర్యాంకులతో మరోసారి తమ సత్తా చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ ఆదివారం తెలిపారు. పి.జయచరణ్ ఆలిండియా 151వ ర్యాంకు, పి.మోహిత్ సాయి సత్య ఆలిండియా 391వ ర్యాంకు, డి.నితిన్ ఆలిండియా 443వ ర్యాంకు, ఎం.ఉమామహేశ్వరరావు ఆలిండియా 474వ ర్యాంకు, జి.విశ్వతేజ ఆలిండియా 567వ ర్యాంకు, వి.యశ్వంత్ నాయక్ ఆలిండియా 609వ ర్యాంకు, ఏవీఎస్ లక్ష్మి రాజేశ్వరి ఆలిండియా 648వ ర్యాంకు, డీఈఎన్.ఆదర్శ వర్మ ఆలిండియా 697వ ర్యాంకు, సీహెచ్ వెంకటసాయి ఆలిండియా 720వ ర్యాంకు, పి.హర్షవర్ధన్‌కుమార్ ఆలిండియా 750వ ర్యాంకు, ఎం.హర్షవర్ధిని ఆలిండియా 800వ ర్యాంకు, ఎస్.నరసింహ సమీర్‌కుమార్ ఆలిండియా 912వ ర్యాంకు, డీబీ అక్షయ్ ఆలిండియా 925వ ర్యాంకులు సాధించారని 1,000 లోపు ర్యాంకులు 13 మంది, 2,500లోపు 41 మంది, 5,000 లోపు 69 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ఫలితాల సాధనకు కృషిచేసిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ అభినందించారు.

నేను–నాది అనే భావన వీడాలి

ప్రవచనకర్త గరికిపాటి


నలదమయంతి కథను ప్రవచిస్తున్న గరికిపాటి

కాకినాడ కల్చరల్: నేను–నాది అనే భావ దరిద్రాలను విడిచిపెట్టినప్పుడే వ్యక్తులు, దేశం బాగు పడుతుందని పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రవచనకర్త డాక్టర్ గరికిపాటి నరసింహరావు అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లో సరస్వతీగాన సభ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న నలదమయంతి చరిత్రపై గరికిపాటి ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. నలదమయంతుల కథను ఆదర్శంగా తీసుకొని జీవిత పయనంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంతో నిలవాలని అన్నారు. నలుడు అడవిలో దమయంతిని విడిచి వెళ్లిన తర్వాత ఆమె పడిన కష్టాలను వివరించారు. సుందర రూపుడయిన నలుడు అడవిలో పాముకాటుకు గురై నల్లగా మారిపోవడం, నలుడు, బహుకుడనే పేరుతో ఋతుపర్ణ మహారాజు వద్ద వంటవానిగా చేరిన ఘట్టాలను వివరించారు. కష్టాలలో కూడా తనకు ఉన్న అవకాశాన్ని ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో నలుడి వ్యక్తిత్వం తెలుపుతోందని వివరించారు. ధైర్యంగా బతకాలి, సంతోషంగా మరణించాలని అన్నారు. అహంకారం, మమకారం రెండు ప్రమాదాలే అన్నారు. కష్టం వచ్చిందంటే వెనుక సుఖం వస్తోందని సూచన అని వివరించారు. ఎండలు మండిపోతున్నాయంటే వర్షాలు బాగా పడతాయని సూచన అని మండుతున్న ఎండలపై చమత్కరించారు. అనంతరం సరస్వతీ గాన సభ సభ్యులు నరసింహారావును ఘనంగా సత్కరించారు. గాన సభ అధ్యక్షుడు కేవీఎస్ ఆంజనేయమూర్తి, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఎల్.సత్యనారాయణ, నారాయణ మురళి, మునుగంటి వెంకట్రావు, శ్రీరామచందరమూర్తి, ఎస్‌కేవీడీ వెంకట్రావు, పెద్దాడ సూర్యకుమారి, చావలి సూర్యకుమారి పాల్గొన్నారు.

కొనసాగిన వరుణ జపాలు

అన్నవరం: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకుంటూ అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో పండితులు నిర్వహిస్తున్న వరుణ జపాలు రెండో రోజు ఆదివారం కూడా కొనసాగాయి. ఉదయం 7.30 గంటలకు దర్బారు మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తుల వద్ద పండితులు ఋష్యశృంగ మహర్షి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం ఋష్యశృంగ మహర్షి విగ్రహంతో ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ప్రదక్షిణ నిర్వహిస్తూ వరుణుడ్ని ఆహ్వానిస్తూ మంత్రాలు పఠించారు. అనంతరం దర్బారు మంటపంలో సుబ్రహ్మణ్య ఆవాహన, వారుణాక వాక మంత్ర పఠనం, వరుణ జపాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు, ఋష్యశృంగ మహర్షికి నీరాజనమంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి, యనమండ్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం కప్పల ఊరేగింపు



అమలాపురం రూరల్: వరుణ దేవుడి అనుగ్రహం కోసం అమలాపురం మండలం బండారులంక గ్రామస్తులు కప్పలను ఊరేగించారు. కప్పలను పసుపు నీళ్లలో వేసి బాజా భజంత్రీలతో గ్రామంలో ఆదివారం ఊరేగించారు. అనంతరం గ్రామంలో సంతర్పణ చేశా రు. ఇది అనాదిగా వస్తున్న ఆచారమని శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి తెలిపారు.

గోదావరిలో దూకి ఆత్మహత్యా యత్నం

రక్షించిన రోడ్డు సేఫ్టీ పోలీసులు


ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఆటో డ్రైవర్

కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన బాదంపూడి రాజేంద్రప్రసాద్ అనే ఆటో డ్రైవర్ భార్యతో గొడవ పడి ఆదివారం గామన్ ఇండియా బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అదే సమయంలో అటువైపు వెళ్లే హైవే మొబైల్ రోడ్డు సేఫ్టీ టీం వాహనంలో ఉన్న పోలీసులు గుర్తించారు. పోలీసులు దిగువన నదిలో ఉన్న జాలర్లను అప్రమత్తం చేశారు. తాళ్ల సాయంతో కిందికి దిగి రాజేంద్రప్రసాద్‌ను రక్షించారు. జాలర్ల పడవలోకి ఎక్కించారు. అక్కడి నుంచి ఒడ్డుకి చేర్చి పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాజేంద్రప్రసాద్ భార్య మరియమ్మకు సమాచారం అందించారు. రాజేంద్రప్రసాద్‌ను పట్టణ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తలుపులమ్మ సంబరాలకు సర్వం సిద్ధం

నేటి నుంచి ఆషాఢ మాసోత్సవాలు


లోవ దేవస్థానంలో ఇటీవల నిర్మించిన ఏసీ కాటేజీలు


బాలాలయంలో లోవ తలుపులమ్మ అమ్మవారు


రూ.21 లక్షలతో ఆధునీకరించిన లోవ రోడ్డు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 17 వరకూ జరిగే ఈ ఉత్సవాలకు నాలుగైదు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశముంటుందని అంచనా వేస్తున్నారు. వారికి మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు దేవస్థానం అధికారులు, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ పర్వదినాల్లో అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గంధామావాస్యకు లోవ కొత్తూరులో 12 రోజులు, ఆషాఢంలో లోవ ప్రాంగణంలో తలుపులమ్మ వారికి నెల రోజులు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. కరోనా విపత్తుతో 2020, 2021 సంవత్సరాల్లో ఆషాఢ మాసోత్సవాలు జరగలేదు. గత ఏడాది పరిస్థితులు అనుకూలించడంతో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సంవత్సరం కూడా ఈ ఉత్సవాలు జరుగుతుండడంతో వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి రానున్నారు.

బాలాలయంలోనే..

స్వయంభువుగా వెలసిన అమ్మవారి ప్రధాన ఆలయ పునర్నిర్మాణం జరుగుతోంది. అందువలన ఈ ఆషాఢ మాసోత్సవాల్లో తలుపులమ్మ అమ్మవారిని బాలాలయంలోనే భక్తులు దర్శించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. గత జనవరి నుంచి ప్రధాన గర్భాలయంలో అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. గత నెల 31న అమ్మవారి మూర్తిని పునఃప్రతిష్ఠ చేసినప్పటికీ ఆలయ నిర్మాణం పూర్తి కాకపోవడంతో భక్తులను దర్శనాలకు అనుమతించలేదు.

విశేష కార్యక్రమాలు

ఆషాఢ మాసోత్సవాల సందర్భంగా ఈ నెల 25న వివిధ రంగుల మట్టి గాజులతో అమ్మవారికి విశేష అలంకరణ చేస్తారు. 29న అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా 108 కలశాల పంచామృతాలతో అభిషేకాలు, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు. జూలై 2న వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేస్తారు. మూడో తేదీన పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రీతికరమైన మహాచండీ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. తొమ్మిదో తేదీ ఆదివారం వివిధ రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. 13న మతత్రయ ఏకాదశి సందర్భంగా అమ్మవారికి విశేష పుష్పాలంకరణ, లక్ష బిల్వార్చన నిర్వహిస్తారు. 16వ తేదీ సాయంత్రం ఘటాభిషేకానికి ఆవాహన కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహిస్తారు. 17వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సప్తనదీ జలాలతో అమ్మవారికి ఘటాభిషేకం నిర్వహిస్తారు.

చురుగ్గా ఏర్పాట్లు

ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. దేవస్థానం ఆధ్వర్యంలో వందకు పైగా వసతి గదులు, కాటేజీలు, పొంగలి షెడ్లు ఉన్నాయి. ఇటీవల రూ.కోటితో చేపట్టిన పనులు పూర్తవడంతో అదనంగా ఏసీ కాటేజీలు, ఉచిత షెడ్లు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. తాగునీరు, శానిటేషన్, అత్యవసర వైద్య సేవలు, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై ధర్మకర్తల మండలి చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు ప్రత్యేక దృష్టి సారించారు. కొండ దిగువన ప్రైవేటు యజమానులు కూడా వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వందలాది తాటాకు పాకలు పునర్నిర్మించారు.

మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం



ఆషాఢంలో తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం. తాగునీటి కొరత, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. మొదటి ఘాట్ రోడ్డును ఆధునీకరించాం. రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. పర్వదినాల్లో నిర్వహించే విశేష పూజలు, అలంకరణలకు ఏర్పాట్లు చేశాం.

– పెన్మెత్స విశ్వనాథరాజు, ఈఓ, లోవ దేవస్థానం



క్లుప్తంగా

యోగ డే సందర్భంగా బైక్ ర్యాలీ



పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా ఆదివారం పట్టణంలో వంద బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. యోగ డే విశిష్టతను ప్రజలకు తెలిపేందుకు ఈ బైక్ ర్యాలీ నిర్వహించారు. పతంజలి యోగ సమితి తాడేపల్లిగూడెం శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీని రూరల్ సీఐ మూర్తి జెండా ఊపి ప్రారంభించారు. శేష మహల్ సెంటర్ నుంచి జయలక్ష్మి థియేటర్, అక్కడ నుంచి ఎస్వీఆర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. యోగా గురువులు ఆరా ఫౌండేషన్ కరిబండి రామకృష్ణ, ఇంజుమూరి మాధవరావు, బడుగు చంద్రశేఖర్, సుధాకర్, చిక్కాల అంబికతో పాటు వివిధ సెంటర్ల నుంచి వచ్చిన యోగా సాధకులు పాల్గొన్నారు. ఈ నెల 21న నిర్వహించే 9వ ఇంటర్నేషనల్ యోగా దినోత్సవాన్ని మునిసిపల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యోగ సాధకులు హాజరు కావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

సాక్షి, భీమవరం: భీమవరం బీవీ రాజు మునిసిపల్ పార్క్ వీరమ్మ పాండ్ వద్ద గ్రీన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్, భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపకరిస్తాయని పలువురు వక్తలు అన్నారు. గ్రీన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.విజయ్ కుమార్, సభ్యులు కె.ఆనంద్, జూలూరి మూర్తి, రామాయణం చిన్నారి, కె.మోహన్, చరణ్, మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు కారుమూరి సత్యనారాయణ మూర్తి, బొండా రాంబాబు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని చినఅమిరం గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటలకు పలు అంతర్గత సీసీ రోడ్లు, ఎల్వీఎన్‌పురం గ్రామంలో సచివాలయ భవనాన్ని ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు ఆదివారం తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఆదివారం కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్‌కలెక్టర్ చెప్పారు. ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

వైభవంగా సూర్యహోమం



సూర్యహోమం నిర్వహిస్తున్న దంపతులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం 160 సూర్యహోమం నిర్వహించారు. కోవిడ్ నుండి కోలుకుని ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలనే సంకల్పంతో మొదలు పెట్టిన సూర్యహోమం 160వ వారానికి చేరుకుంది. పురోహితులు రవీంద్ర బ్రహ్మత్వంలో పందిటి మోహన్ దంపతులు ఈ సూర్య హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కేవీఎల్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.జ

పారదర్శకంగా జగనన్న సురక్ష నిర్వహణ

ఆకివీడు: జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్ సూచించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో ఆదివారం వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. శిక్షణా కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులు పొందుతున్న పథకాలు తెలుసుకుని, ఇంకేమైనా పథకాలకు అర్హులైతే వారి పేర్లను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా జగనన్న సురక్ష పథకం అమలుజేస్తున్నారని చెప్పారు. అర్హులను గుర్తించి, వారి నుంచి దరఖాస్తు తీసుకుని అప్‌లోడ్ చేయడం ద్వారా సంబంధిత అర్హత పథకం వారికి వర్తింపజేసేందుకు వలంటీర్లు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ఆకుతీగపాడులో గడపగడపకు ప్రభుత్వం



ఆకుతీగపాడులో మహిళకు పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కేఎస్ఎన్

పెంటపాడు: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పెంటపాడు మండలం ఆకుతీగపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం సాయంత్రం గ్రామంలో పర్యటించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నవరత్నాలు, పేదలకు ఇళ్లు, నాడు- నేడు, ఆసరా, చేయూత ఇలా ప్రతి పథకం కుల,మత, రాజకీయ రహితంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రజలు సీఎం జగన్ పాలనను స్వాగతిస్తున్నారని ఈ విషయం గడపగడప కార్యక్రమంలో స్పష్టంగా తెలుస్తోందన్నారు. పథకాలు ప్రజలకు వివరించే సమయంలో లబ్ధిదారుల మోములో ఎంతో సంతోషం కనిపిస్తోందన్నారు. ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలు అధికారం కోసం వైఎస్సార్ సీపీపై అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. నేడు గడపగడపకు కార్యక్రమంలో భాగంగా అన్ని వర్గాలకు పథకాలు అందడంతో ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. మరలా జగనన్నను సీఎంగా కొనసాగించేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు కేఎస్ఎన్ తెలిపారు. జగనన్న పారదర్శక పాలన చూసి ప్రతిపక్షాలకు ఏమి మాట్లాడాలో తెలియక తికమక పడుతున్నారన్నారు. పవన్ ఆలోచన వాస్తవికతకు దగ్గరగా లేదన్నారు. 14 ఏళ్లు దుర్మార్గపాలన సాగించిన చంద్రబాబుకు మద్దతుగా నిలిచిన పవన్ కల్యాణ్ సాధించేదేమీ లేదన్నారు. టీడీపీ యాత్రతో పాటు, జనసేన చేపడుతున్న వారాహి యాత్రను, అధినేత పవన్ కల్యాణ్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. నియోజకవర్గంలో నాలుగులైన్ల రహదారిని రూ. 45 కోట్లతో ఏర్పాటు చేసామని, త్వరలో పెంటపాడు- విప్పర్రు రహదారి, ఆకుతీగపాడు- కె. పెంటపాడు ముక్తేశ్వరం రహదారి అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా జగనన్నకు, కేఎస్ఎన్‌కు అనుకూలంగా స్థానికులు నినాదాలు చేసారు. రావిగుంట, ఆకుతీగపాడు గ్రామాల్లో కొట్టు సత్యనారాయణకు హారతులిచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, నిమ్మల పెదకాపు, వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, ఆకుల శ్రీను, వీరాబత్తుల సత్యనారాయణ, చింతల నాగరాజు, పెనుకుదురు దాసు, సోమిశెట్టి శ్రీను, రామనాగు ఎంపీపీ దాసరి హైమావతి, వీర్ల గోవింద్, గుండుమోగుల సాంబయ్య, ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు, పార్టీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, పార్టీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, మాల మహానాడు నాయకులు చీకటిమిల్లి మంగరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, మైలవరపు పెదబాబు, సొసైటీల అధ్యక్షుడు బూరాడ శ్రీనివాస్, దేవ వెంకటరమణ, ములగాల రామసత్యనారాయణ, సర్పంచ్‌లు గొర్రెల కోటేశ్వరరావు, గేదల శివకుమార్, రెడ్డి సూరిబాబు, దేవరశెట్టి రాంబాబు, మర్రే కృష్ణమూర్తి, మట్టా సత్యనారాయణ, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంచార వైద్యశాలతో వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 10 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, సజ్జాపురం, పైడిపర్రు, తేతలి తదితర గ్రామాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 10 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సంఘ సభ్యులు అడ్డగర్ల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి బాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

42 మంది ఉచిత వైద్య పరీక్షలు ...

ప్రతీ నెలా మూడు ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలోని సంఘ కార్యాలయంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో 42 మంది ఉచిత సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పి.సత్యనారాయణ, సాయి శ్వేత డయాగ్నోస్టిక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

102 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య శిబిరం, పాల్గొన్న సభ్యులు



అవార్డు అందుకుంటున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వైద్యులు బృందంతో కంటి పరీక్షలు నిర్వహించారు. 102 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 9 మందిని నిడదవోలుకు పంపారు. 22 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు నిర్ణయించారు. శిబిరాన్ని దాత పదం కుమార్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను సభ్యులు సత్కరించారు. సన్నిధి సూర్యనారాయణ మూర్తి, వి.రామ్మోహన్‌రావు, చిన్నం జగదీష్, ఎల్ఎస్వీ నాగేశ్వరరావు, గట్టిం మాణిక్యాలరావు, మదన్మోహన్ అగర్వాల్, హరిబాబు, గరికపాటి బాపయ్యశర్మ, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెంకు అభినందన

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ జిల్లా కాన్ఫరెన్స్ నిడదవోలులో నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెంనకు జిల్లాలోని 72 క్లబ్స్‌లో అత్యుత్తమ సేవలు అందించినందుకు ఫస్ట్ బెస్ట్ క్లబ్ అవార్డు, గోల్డ్ మెడల్ అందించారు. క్లబ్ సేవలను పలువురు అభినందించారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్‌కు అవార్డు

పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ నిర్వాహకులు పలు అవార్డులు అందుకున్నారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్ జిల్లా అవార్డ్స్ ఫంక్షన్ నిడదవోలు నిర్వహించగా తాడేపల్లిగూడెం డైమండ్స్‌కు టాప్ స్టార్ క్లబ్ అవార్డు, బెస్ట్ యూత్ అవేర్నెస్ అవార్డు, అదే విధంగా వశిష్ట లియో క్లబ్ స్పెషల్ న్యూ క్లబ్ అవార్డు అందుకున్నారు. డైమండ్స్ క్లబ్‌ను ఆదివారం పట్టణంలోని పలువురు ప్రముఖులు అభినందించారు. క్లబ్ అడ్మిన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, గట్టిం మాణిక్యాలరావు, లియో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆహారం పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమ్మానాన్న సేవా సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఫాదర్స్ డే నిర్వహించారు. యాగర్లపల్లిలో నివసిస్తున్న రోగులకు, పేదలకు ఫాదర్స్ డే సందర్భంగా బిర్యానీ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్ అందజేశారు. వక్తలు మాట్లాడుతూ నిరుపేదలను, రోగులను గుర్తించాలని, వారికి వీలైనంత సహాయం చేయాలని వివిధ స్వచ్ఛంద సంస్థలకు విజ్ఞప్తి చేశారు. అధ్యక్షులు వర్రే కోటేశ్వరరావు, కార్యదర్శి మహమ్మద్ కపర్ది, కిరణ్ పాల్గొన్నారు.

గృహోపకరణాలు దగ్ధం

నరసాపురం: పట్టణంలోని 11వవార్డులో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో విద్యుత్ హై ఓల్టేజ్ కారణంగా పలు ఇళ్లలో షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు బూడిదయ్యాయి. 10 ఇళ్లలో ఏసీలు, 25 ఇళ్లలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, 10 ఇళ్లలో ఫ్రిజ్‌లు కాలిపోయాయి. కొన్ని ఇళ్లలో మంటలు కూడా రావడంతో జనం భయభ్రాంతులకు లోనయ్యారు. వార్డులోని వెలంపేట, ద్వారావారి వీధి రెండు ప్రాంతాల్లోని ఇళ్లు ప్రమాదానికి లోనయ్యాయి. వార్డులో తరచూ ఇలానే జరుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పశువుల బీమాతో రైతులకు ఎంతో ప్రయోజనం



మండల పశువైద్యాలయంలో రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మహేష్

పెంటపాడు: పాడిపశువులు, మూగ జీవాల రైతుల ప్రయోజనమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశువైద్యపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి, జిల్లా వెటర్నరీ వైద్యుల అధ్యక్షుడు డాక్టర్ మహేష్ పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో రైతులతో సమావేశం నిర్వహించి బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ ఈ వైస్సార్ పశు బీమా పథకం (పశు నష్టపరిహార పథకం) రూపకల్పన చేసిందన్నారు. ప్రతి పాడి పశువుతో పాటు, మూగ జీవాలైన, మేకలు, గొర్రెలు, పందులకు కూడా బీమా వర్తిస్తుందన్నారు. దీనికోసం ప్రభుత్వం 80 శాతం ప్రీమియం భరిస్తుందన్నారు. జూన్ 1 నుంచి ఈ పథకం అమలులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సమీపంలోని పశువుల ఆసుపత్రి, లేక పశుసంవర్ధక శాఖ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలి.

కుటుంబానికి నిత్య శ్రామికుడు తండ్రి

తణుకు టౌన్: కుటుంబానికి వెలుగులు నిత్య శ్రామికుడు తండ్రి అని సాహితీ సామ్రాజ్యం సాహితీ సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కర రావు చెప్పారు. అంతర్జాతీయ పితృ దినోత్సవం సందర్భంగా తణుకులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పితృదినోత్సవానికి సంబంధించిన వివిధ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొండా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కుటుంబంలో తండ్రి పాత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా బాల సుబ్రహ్మణ్యంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాన్న నేనున్నా అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎండీ అలంగీర్ భాషా, ఎం మోహనరావు, పీ సీతారామయ్య చౌదరి, వి మల్లికార్జునరావు, దుర్గా ప్రసాద్, కె గురు లింగేశ్వరరావు, ఎండీ జనీల్, పీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొండేపాడులో ఉపాధి గ్రామసభ



గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి సభలో మాట్లాడుతున్న ఎస్ఆర్పీ పున్నమనాయుడు

పెంటపాడు: బి. కొండేపాడులో ఆదివారం ఉదయం ఉపాధిహామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్ గ్రామ సభ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఆర్పీ ఇ. పున్నమనాయుడు మాట్లాడుతూ 2022-23 సంవత్సర కాలంలో జరిగిన పనులకు సంబంధించి ఈనెల 15 నుంచి 18 వరకు గ్రామ సభ నిర్వహించామన్నారు. పంచాయతీరాజ్ 8 పనులు, ఉపాధిలో 90 పనులు, హౌసింగ్‌లో 80 పనులు కాలవలకు సంబంధించి 23 పనులపై ఆడిట్ పూర్తయ్యిందన్నారు. గ్రామంలో రూ.44 లక్షల ఖర్చుతో ఉపాధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈనెల 20న మండల కార్యాలయం వద్ద సామాజిక ప్రజా తనిఖీ వేదిక సభ నిర్వహించనున్నట్లు నాయుడు తెలిపారు. బి. వరాహమూర్తి, సర్పంచ్ కట్టా దానయ్య, ఎంపీటీసీ సభ్యులు దేవరశెట్టి సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి శ్రీరంగ పాల్గొన్నారు.

మంత్రి కొట్టు సత్యనారాయణకు పాస్టర్ల సత్కారం



కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న పాస్టర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ నివాసం వద్ద ఆదివారం పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డులోని క్రైస్ట్ లూథరన్ చర్చి ఏ క్లాస్‌పేరిష్‌లో నూతనంగా చేరిన పాస్టర్ రెవ.డి.ఎల్.ఫినేహస్ మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మరింత ఉన్నతి సాధించాలని, ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరించారు. చైర్మన్ కాండ్రు విజయప్రసాద్, కోశాధికారి నక్కా మార్టిన్ విద్యాసాగర్, అడిషనల్ పాస్టర్ రత్నాకర్, జే.రత్నరాజు, యం.ఏసుపాదం, నామాల రాజు, సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మారం వెంకటేశ్వరరావుకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఇంకూలు కల్యాణ మండపంలో ఆదివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే సామిశెట్టి వెంకటేశ్వర్లు, ఏలూరు మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పాల్గొన్నారు. పేద విద్యార్థి చదువుకు విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం బోర్డు సభ్యుడు మారం వెంకటేశ్వరరావు రూ.50 వేలు విరాళం అందజేశారు. కోనా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముగ్గురు పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మారం వెంకటేశ్వరరావును ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుక

ఉండి: అంతర్జాతీయ ఫాదర్స్‌డే వేడుకలు ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చిలో పురుష సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫాదర్స్‌డేను పురస్కరించుకుని నిర్వహించిన మెన్స్ సండే కార్యక్రమాన్ని స్థానిక పేరిష్ పాస్టర్ వి.నెహ్రూ, సీఆర్ పి.కరుణాకర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులైన సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ ఎస్.శేఖర్‌బాబు క్రీస్తు బోధించిన పురుషుడి విధులు, కుటుంబం, సమాజంలో అతని బాధ్యతలను వివరించారు. ఆయన మాట్లాడుతూ తండ్రి స్థానానికి సమాజంలోను, కుటుంబంలోను గొప్ప గౌరవం ఉందని, దానిని కాపాడుకుంటూ దేవునితో భయభక్తులు కలిగి బతకాలని సూచించారు. కుటుంబ పెద్దగా, భర్తగా నిర్వర్తించాల్సిన బాధ్యతను నిర్లక్ష్యం చేయకుండా ఉండాలని, దీని ద్వారా ఓ మంచి కుటుంబాన్ని నిర్మాణం చేయగలమన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ట్రినిటీ లూథరన్ చర్చ్ సంఘ పెద్దలు, పీసీసీ సభ్యులు, పురుష సమాజ సభ్యులు పాల్గొన్నారు.

రేపు తణుకులో సినీ పాటల పోటీలు

తణుకు టౌన్: తణుకు స్వరాంజలి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు, గాయకులు ఏ రాజు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి తణుకులోని సురాజ్య భవన్‌లో జరిగే ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణలు నటించిన చిత్రాల్లోని పాటలపై పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు రూ. 200 ఎంట్రీ ఫీజును నిర్ణయించినట్లు తెలిపారు. ఈపోటీలలో విజేతలైన వారికి బహుమతులు, మెమెంటోలతో సత్కరిస్తారని తెలిపారు. అనంతరం సాయంత్రం సినీ సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా మావుళ్లమ్మ జాతర

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము వరకూ గ్రామంలో మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ నిర్మాణ కమిటీల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గరగల నృత్యాలు, సినీ వనకన్య ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారి నృత్య రూపకం ఆకట్టుకుంది. రెండు రోజుల పాటు తీర్థ మహోత్సవం కనుల పండుగగా నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కేపీపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ విపరీతంగా కాయడంతో పాటు వేడిగాలులు వీస్తుండడంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వర స్వామి, వేళాంకణి మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

యలమంచిలి: జగనన్న ప్రభుత్వంలో నవత్నాల పేరిట పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. మేడపాడులో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో నిర్మిస్తున్న అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో అవినీతి, సిఫారసులకు అవకాశం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత మన ప్రభుత్వానిదన్నారు. అదే సమయంలో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందుకునేలా చేసిన ఘనత కూడా జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ విషయాలను ప్రజలకు గుర్తు చేసి వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మరొకసారి జగనన్నను ముఖ్యమంత్రిగా ఎన్నుకునేలా ప్రజలకు ఉత్తేజపరిచే బాధ్యత సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు తీసుకోవాలని ఆయన కోరారు. వచ్చే ఎన్నికల నాటికి ప్రస్తుతం జరుగుతున్న పనులన్నింటినీ పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని శ్రీనివాస్ చెప్పారు.

చేపల చెరువు తవ్వకం నిలిపివేయాలంటూ నోటీసు

ఆకివీడు: అనుమతి లేని చెరువు తవ్వవద్దని మత్స్య అభివృద్ధి అధికారి వివేక్ ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలోని అడ్డుకోడు పంట కాల్వకు చేర్చి వెలగన వెంకన్న అనే రైతు చేపల చెరువు తవ్వుతున్నారని, ఆ ప్రాంతానికి చెందిన రైతు వెలగన శ్రీనివాసరావు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మండల మత్స్య అభివృద్ధి అధికారి కె.వివేక్ ఆ ప్రాంతాన్ని ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి అనుమతి లేకుండా తవ్వుతున్న చెరువును తక్షణం నిలుపుదల చేయాలని నోటీసు జారీ చేశారు. తవ్వకం పనులు నిలుపుదల చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసు ద్వారా తెలియజేశారు.

కాలువలకు సమృద్ధిగా సాగు నీరు

పెనుమంట్ర: మండల పరిధిలోని ప్రధాన కాలువలకు సమృద్ధిగా సాగునీరు విడుదల చేయడంతో రైతులు నారుమడులకు సమాయత్తమవుతున్నారు. గోస్తనీ పంటకాలువలో నీరు పుష్కలంగా విడుదల కావడంతో బ్రాంచ్ కాలువలకు కూడా శనివారం నుంచి నీరు విడుదల చేయడంతో రైతులు నారుమడులకు సిద్ధమవుతున్నారు. పెనుమంట్ర పరిధిలో భట్లమగుటూరు, నేలపోగుల బ్రాంచ్ కాలువలకు సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
తాడేపల్లిగూడెం
సోమవారం ॥ 19-6-2023

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మానాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే

సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ

మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అమలులో నిలపాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!

నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.



భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.

పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పడది నీకు ఆత్మ బంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంత కన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం

ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.



ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు.

అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా



రవితేజ

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.


వారికి కాజల్ ఓ ఉదాహరణ

– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లు లాంటిది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ



మహేశ్‌బాబు

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా


– నందితా శ్వేత



అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

మా నాన్న సూపర్ హీరో!



సుధీర్‌బాబు

'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?




రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాన్నీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాన్నీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు

తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. చాన్సులు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

సంక్రాంతికి జాతర

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



ప్రజ్వల్